ఇది కథ కాదు!

[ఇది కథ గాదు! కటిక నిజం! నిజ సంఘటనకు దిద్దిన మెరుగులు. 'కథ!' కన్న కడుపు తీపికంటే ఆకలి ఎక్కువదని, తల్లి పిల్ల మధ్య ఉండాల్సిన అనుబంధాలనికూడా దుర్భర దారిద్ర్యం జయిస్తుందన్నది—యిలాటి తల్లికూతుళ్ళు కోట్ల సంఖ్యలో ఉన్న మనదేశంలో—యిలాటి కథలు నిరూపిస్తాయి. పాతికేళ్ళలో మనం సాధించిన ప్రగతి యిది.]

*　　　　*　　　　*

ఎండాకాలం. ఎండ నిప్పులు చెరుగుతూంది. పన్నెండు గంటల సమయం! బయటికి రావడానికే భయం వేసే వేడి!

కర్టెన్లు అన్నీలాగి గదిలోకి ఎండపొడ రాకుండా చేసుకుని, ఫేన్ వేసుకుని నో రెండుకు పోతున్నదల్లా ఫ్రిజ్‌లో నీళ్ళు త్రాగుతూ, వేడికి ఆపసోపాలు పడుతూ పుస్తకం చదవాలని తాపత్రయ పడుతున్నాను. ఆ వేడికి, ఉక్కకి కనీసం పుస్తకంకూడా చదవలేక పోతున్నాను.

ఉన్నట్లుండి బయట పెద్ద గోల, ఏడుపు అమ్మోయ్, బాబోయ్ అంటూ గోలగోల. పెద్ద కేకలు. ఏడుపు.... చప్పున తలుపు తీసి బయటకి వెళ్ళాను.

మా యింటి ముందు అప్పటికే ఓ గుంపు తయారైంది. పదేళ్ళ పిల్ల పెద్దగా గోడు గోడున ఏడుస్తూంది. ఓ ఆడమనిషి ఆ పిల్లని చింత బరికతో బాదుతూంది. జుట్టు పట్టుకు గుంజి గుంజి ఎత్తి కుదేస్తూంది. కాలితో తన్నేస్తూంది. ఆ పిల్ల చేతిలో వున్న కట్టెల మోపును లాక్కోవాలని ప్రయత్నిస్తూంది. నోటికి రాని బండబూతులు తిడ్తోంది. అన్ని దెబ్బలుతింటున్న

ఆ పిల్ల ఆ కట్టెల మోపును వదలడం లేదు: 'నే తెస్తానే అమ్మోయ్, కొట్టకే అమ్మో, నే నీయనేబాబో....' అంటూ దెబ్బలకి చేతులు అడ్డం పెట్టకుంటూ వుంటే ఆ సందులో ఆడది కట్టెలమోపు లాక్కోవాలని ప్రయత్నించేంతలో ఆ పిల్ల మళ్ళీ మీదపడి ఆ మోపు లాక్కుంటోంది. 'వదలయే, నంజకానా, వదులుతావా లేదా, నీ చేతులిరగ నిన్నియాల సంపేస్తా నంజకూతురా, వదులు ముందు. వంటో ఓపికలేదు. నీ అంత ఎత్తు మోపెలా ఎత్తుకొస్తావే సంజ, వదల్తావా లేదా' అంటూ మళ్ళీ బాదింది. మళ్లీ ఆ పిల్ల ఏడుపు. ఆ పిల్ల కట్టెల మోపు వదలదు.

చూస్తూంటే నాకేం అర్థం కాలేదు. ఆ పిల్ల ఎవరు, ఆడ మనిషి ఎవరు? యిద్దరికీ ఏమిటి సంబంధం? ఆ పిల్ల తనంత బరువున్న కట్టెల మోపు, మోయలేని బరువు వున్నా అది మోసుకొస్తానని ఎందు కేడుస్తూంది? ఆ కట్టెలమోపు ఈయమని ఆడది ఎందుకు కొడ్తోంది? ఆ కట్టెల మోపు ఎవరిది? వాళ్లిద్దరూ ఏమవుతారు? ఏమీ అర్థంకాక గుమ్మం దిగి గేటు దగ్గిరకు నడిచాను. అప్పటికే మా కాలనీలో ఆడవాళ్ళందరూ ఆ గోలకి తలుపులు తెరుచుకుని బయటికివచ్చి నాలాగే చోద్యం చూస్తూ నిలబడ్డారు కాసేపు, ఆ పిల్లని అలా బాదుతూంటే చూడలేక అందరూ ముందుకు వచ్చారు సంగతి ఏమిటో తెలుసుకుందామని. ఆ గోలకి అసలందరూ ఆ వీధిలో ఏ దొంగతనమో జరిగింది కాబోలు దొంగని పట్టుకుని కొడ్తున్నారు కాబో లనుకుని ఆరాటంగా అంతా తలుపులు తీసుకు వచ్చారు, కాని జరుగు తున్నది వేరు.

"ఏయ్ అమ్మి... ఆ పిల్లని ఎందుకలా చావకొడ్తున్నావు. చస్తుం దనుకుంటున్నావా బ్రతుకుతుం దనుకుంటున్నావా" అంటూ కేకలేసాను. "అసలు నీ వెవరు అది నీకేం అవుతుంది. దాన్నెందుకు అలా కొడ్తున్నావు" అంటూ మా పక్కింటావిడ ముందుకు వెళ్ళి అడిగింది. అందరూ గుమ్మం దిగి రోడ్డుమీదికి వచ్చారు.

నిప్పులు చెరిగే ఆ ఎండలో కాళ్ళకి చెప్పులయినా లేకుండా కాళ్ళు బొబ్బలు ఎక్కేంత ఆ వేడిలో ఆ పిల్ల నల్ల శరీరం కూడా ఎండకో, ఏడు

పుకో, దెబ్బలకో ఎర్రబడి పోయింది. ఏడ్చి ఏడ్చి వగరుస్తూ ఆయాస పడిపోతూంది, పళ్ళంతా చెమటలు కారిపోతున్నాయి. అట్టలుకట్టిన జుట్టంతా పీకడంతో చీకేసిన తాటిపండులావుంది. కొట్టకొట్టి అలసిపోయి కాబోలు వగరుస్తూంది. మేం అందరం గుమిగూడడంచూసి కొట్టడం ఆపింది. ఆ పిల్ల ఆ మండుటెండలో నడిరోడ్డుమీద ఆ కట్టెల మోపుని కౌగలించుకుని దాని మీద వాలిపోయి వెక్కుతూంది ఏడవడానికి ఇంక ఓపికలేనట్టు 'ఊః.... ఊః.... అమ్మో, బాబోయి' అంటూంది సన్నగా.

"ఏయ్ నీవు మనిషివేనా అంత చిన్న పిల్లని పట్టుకుని అలా కొడ్తావా, దానికి నీవేం అవుతావు?" అంటూ గుడ్లెర్రచేసి అడిగాను ఆ పిల్ల స్థితికి జాలిపడి.

"నా కూతురే అమ్మగారూ. మొండినంజ సూడండి యిన్ని దెబ్బలు తిన్నా మాట యినదు.... మోపు వగ్గదు, ఎంటరాయే ఎత్తుకుని అంటే ఎత్తుకో నేదు. ఏటిసేయ మంటారు సెప్పండి కొట్టక" అంది అందరి వంకా చూస్తూ, నా తప్పేం లేదన్నట్టు చూసింది.

దాని మాటలకి అర్థం బోధపడలేదు నాకు. స్వంత కూతురే అం టుంది, తల్లీ కూతురే కనక ఆ పిల్ల తను మోయలేని బరువు తల్లి ఎత్తు కొస్తానంటే హాయిగా బరువు వదుల్చుకోవచ్చుగదా! మరి ఆ పిల్ల ఆ మోపు ఎందుకు వదలదు? మోయలేకపోయినా తనే మోసుకొస్తానని ఏడవడం ఏమిటో వింతగా అన్పించింది.

రోజూ మా వీధమ్మంట యిలాంటి కట్టెల మోపులు ఎత్తుకుని చాల మంది వెళ్ళడం రోజూ చూస్తూనే వుంటాను. పెద్దపెద్ద ఎండుకొమ్మలు నరికి అవన్నీ ఓ మోపుకట్టి రెండు రూపాయలకి అమ్ముతారు. పెద్దవాళ్ళ వెనక ఏడెనిమిదేళ్ళ పిల్లల దగ్గరనించికూడా వాళ్ళెత్తుకోగలిగిన బరువు మోపు ఎత్తుకుని వెడుతూంటారు అమ్మడానికి. ఆ చుట్టుప్రక్కల రెండు మూడు మైళ్ళదూరాన వున్న కొండలలో చిన్న చిన్న అడవులలో యీ కంపలు కొట్టి వూళ్ళోకి తీసుకొచ్చి అమ్ముతూంటారు. ఉదయానే అడవికి పోయి

కట్టెలుకొట్టి ఊళ్లోకి తెచ్చి, అమ్మి ఆ తెచ్చుకున్న డబ్బుతో బియ్యం ఉప్పు పప్పు కొనుక్కొని సాయంత్రం అయేసరికి యిల్లు చేరతారు అలాంటి వాళ్ళు. అలాంటి వాళ్ళల్లో ఈ తల్లీపిల్లా ఒకరు !

"అదేమిటి ఎందు కీయనంటుంది, అది మోయలేకపోతే దాని మోపు నీకీయడానికేం?" నే అడగదల్చిన ప్రశ్న ఎదురింటావిడ అడిగింది.

"అదేనమ్మా.... దాని మొండితనం సూడండి, నే ఎత్తుకెల్లి అమ్ముకొస్తానే యియ్యే అంటే ఇనదు, అదే తేవాలంటది, బుర్రమీద ఎత్తుకునేసరికి నడలేక కూలబడద్ది....నన్నెల్ల నీయదు. అది నడలేదు... ఎండ మాడిపోతంది, బేగి కర్రలమ్ముకుని ఎల్లాలంటే యీగుంట సచ్చింది మాట ఇనదు...." తల్లి ఫిర్యాదు చేసింది.

"ఓలమ్మో... నే నీయనే అమ్మో.... పొద్దుటేలనించి కట్టెలు కొట్టినాను, నా నమ్ముకుంటానే.... ఇంతదూరం మోసుకొచ్చి నీ కిస్తానేంటేవ్....మోపు నా నెత్తినేట్టే... ఈ సారి నడుస్తానే అమ్మోవ్" అంటూ ఆ పిల్ల ఏడుస్తూ లేచి నిల్చుంది....." నీ జిమ్మడ.... ముదనష్టపుముండ— ఈ తూరి నడిచి రాకపోతే ఈ కత్తెట్టి నీ పీక తెగగోస్త" అంటూ తల్లి కట్టెలు కొట్టే కత్తితీసి కూతురి మీద కెదరి వెళ్ళింది.

"ఓలమ్మో, కొట్టకే. మోపెత్తే..." అంటూ ఏడుపు లంకిచుకుంది ఆ పిల్ల. "ఎత్తుకోవే నంజా, ఎత్తుకో, ఈ తూరి వగ్గేసావంటే సంపేస్తా" అంటూ ఆ తల్లి కూతురు కట్టెల మోపు ఎత్తి దాని బుర్రమీద పెట్టి 'నడు నంజా నడు, అంటూ తన మోపు ఎత్తుకుంది. ఆ పిల్ల కట్టెల మోపు బుర్ర మీద పెట్టగానే ఆ బసువుకి తూలిపోయింది. బుర్రమీద మోపు నిలుపుకోలేక క్రింద పడబోయి నిలదొక్కుకుంది. బుర్రమీదనించి జారిపోతున్న మోపు జారకుండా నిలుపుకోలేక అలాగే నాలుగడుగులు వేసి మరి నడవలేక మోపుతోపాటు క్రింద కూలిపోయింది. 'ఓలమ్మో' నే ఎత్తుకోలేనే.... అంటూ భయం భయంగా తల్లివంక చూస్తూ ఏడుపు లంకించుకుంది—

తల్లి తన మోపు ధభాలున క్రింద పారేసి మళ్ళీ ఓ కర్రపుల్ల విరిచి పీరా వేశంతో ఆ పిల్లదగ్గిరకి వెళ్ళి బాదడం మొదలుపెట్టింది. 'ఏటే ఎదవ

సంజా, ఇదేటి తమాసా అనుకున్నావేటి... గుడిసేటి సంజా సావు ఇక్కడే... నా ఎనకల మల్లా బయలు దేరావంటే సూడు....ఆ కర్రలట్టుకుని సావు.... పీడాపోతది ఆ కర్రలతోటే నీకు నిప్పెడతా' అంటూ బాదుతూ, జుట్టుపట్టుకు ఎత్తికుదేసింది. అందరం వెళ్ళి అడ్డుపడేసరికి ఆగింది. చేతిలో పుల్ల విసిరేసి తనమోపు ఎత్తుకుని నడవడం మొదలుపెట్టింది.... 'ఓలమ్మో ....ఎల్లి పోవద్దే .... నన్నొగ్గి పోవద్దే.... 'ఆ పిల్ల ఏడుస్తూ తల్లి కాళ్ళకి అడ్డపడింది. తల్లికాళ్ళతో తన్నింది కూతుర్ని.

ఇంతసేపు చూస్తున్న వాళ్ళిద్దరి భాగోతం అంతుపట్టలేదు నాకు. "ఏయ్ పిల్లా నీకు బుద్ధుందా లేదా ? ఆ మోపు నీవు మోయలేని దానివి మీ అమ్మ ఎత్తుకొస్తానంటే యీయవేం, నీవు మోయలేవు మీ అమ్మ కీయవు, దానికోసం ఒచ్చేట్లు దెబ్బలు తింటూకూడా వదలవేం, హాయిగా మీ అమ్మ ఎత్తుకొస్తానంటే నీకేం బాధ" కసిరాను. ఇందాకటినించి ఆ పిల్లమీద జాలి దాని మొండితనం చూడగానే కోపంగా మారింది. చూసే వాళ్ళకి ముందు అలా కొట్టడం తల్లి తప్పులా కనిపించినా ఇప్పుడు కూతురి మొండితనం విసుగు కలిగిస్తూంది. అస లా కర్రలు వదలక పోవడంలో ఆ పిల్ల ఉద్దేశం ఏమిటో అర్థంకావడంలేదు. ఆ కర్రల మోపు తన ప్రాణంలా విడవకుండా పట్టుకోవడం, ఎంత బరువున్నా తనే మోసుకొస్తా ననడం ఏదో వింతగా కన్పించింది.

"నా నీయనం డమ్మగోరూ.... ఆ మోపు నాది.... పొద్దుటే లంతా కర్రలు కొట్టాను. యీ కడకి లాక్కొచ్చినాను నా నమ్ముకుంటే నాకు రెండు రూపాయలొస్తాయి.... నాను మోపు ఒగ్గను...." ఏడుస్తూనే అంది ఆ పిల్ల!

"మీ అమ్మ ఎత్తుకెళ్ళి అమ్ముతుందిగా. మీ అమ్మే గదా, దాని కీయ దానికేం...." మా ప్రక్కింటావిడ ఆశ్చర్యంగా అడిగింది.

"నాను డబ్బులు యియ్యకపోతే మా అమ్మకూడెట్టదు.... కర్రల మ్ముతే రూపాయిస్తే ఆ డబ్బు లట్టిగెడితేనే కూడెట్టతది...." ఆ పిల్ల ఏడుస్తూనే అంది.

"ఏశే నంజా.... నీకు కూడెట్టకుండానే గాలికి పెరిగావుటే ఇన్నాళ్లు ....నీకు కూడు పెట్టకుండా మాడ్చి సంపుతున్నానని సెపుతున్నావా...." అంటూ మీద మీదకువచ్చి కూతురి జుట్టు పట్టుకుంది.... "పూటకి మూకుడు సెల్లిస్తావు నీ అబ్బ ఎవడే నీకు పెడ్తున్నాడు...."

"ఊరికే ఎడ్తున్నావేటి. నాను డబ్బులట్టుకొస్తే పెడతావు నేకపోతే ఇన్ని గంజి నీళ్ళు పోస్తావు నా మొహాన.... ఇప్పుడీ కర్ర లట్టుకెళ్ళి నీ వమ్ముకుంటావు. నాను డబ్బులు యీయనేదని నా కిన్ని గంజినీళ్లు పోసి నీవు కూడు మెక్కుతావు".... తల్లిని కొరకొర చూస్తూ ఆ పిల్ల ఆవేశంగా అంది.

"నీజిమ్మడ...." అని కూతుర్ని మెటికలు విరిచి తిట్టి సూసా రమ్మగోరూ గుంటనంజ మాటలు. కూతురికి తిండెట్ట కుండా తల్లి మాడ్చి పంపేస్తదా.... నలుగురినీ చూస్తూ అంది తల్లి.

"ఎప్పుడెట్టావు నాకు? డబ్బులీయక పోతే చావు ముండా అంటూ మూకుట్లో యిన్ని గంజినీళ్ళు పోస్తావు. డబ్బు లిచ్చిన నాడు కూడెడతావు ....నిన్న డబ్బులీయలేదని కూడెట్టా?" నిలేసింది కూతురు....

అందరం విచిత్రంగా ఆ తల్లీ కూతుళ్ళని చూస్తూ. వాళ్ళ వాదనని వింతగా వింటున్నాం. అప్పటికి వాళ్ళిద్దరి గొడవ అర్థం అయింది నాకు. కూతురు రోజూ సంపాదిస్తే తప్ప తల్లి తిండి పెట్టదన్న మాట। తను కర్ర లమ్మి డబ్బిస్తేగాని తల్లి తిండి పెట్టదన్న భయంతో కర్రలు ఎత్తుకోనికి ఓపిక లేకపోయినా ఆ కర్రలు తనే పట్టు కెళ్ళి అమ్ముకోవాలని ఆరాట పడ్తూంది ఆ పిల్ల. అందులో నిన్ననుకూడా తిండిలేదు కనక. యీ పూటనా డబ్బులు యిచ్చి తిండి తినాలని ఆ పిల్ల ఆశ। ఆ ఆశతో చచ్చే దెబ్బలు తింటుంది। ఆహా, ఆకలి మహిమ అనుకున్నాను. ఆ తల్లిని చూస్తుంటే ఏవగింపు కల్గింది! పట్టుమని పదేళ్ళు లేని పిల్ల తన తిండికి తను డబ్బులు సంపాదిస్తేనే తిండి పెడ్తాననేటంత కఠినంగా ఏ తల్లేనా వుంటుందా....ఇంత

కర్కోటకపుదా అనిపించింది. అందరి మొహాలలోనూ అదే భావం తొంగి చూసి ఆ తల్లిని ఏవగింపుగా చూశారు అందరూ. మా మొహాలు చూస్తూ మా భావం గ్రహించినదానిలా ఆ తల్లి....

"ఏటి సెయ్యనండమ్మగారూ, నలుగురు పిల్లలు, అంతా సంటివాళ్లు. యిదే కాస్త చేతికందొచ్చింది. నల్గురు పిల్లల్ని కన్నాం మొగసచ్చినోడు సెనొగ్గి మరొకత్తిని తెచ్చుకున్నాడు. ఈ పిల్లలు నాపాల పడ్డారు, నలుగురు గుంటెదవల్ని ఏటిపెట్టి పోసించను. కాయకష్టం సేసుకుని ఏ రోజు డబ్బు ఆరోజు తెచ్చుకుంటే తప్ప నోటి కాడకి కూడు రాదు. నా నొక్కదాన్ని నలుగురు సంటిపిల్లల్ని ఎలా సాకను! ఇది సేతికందొచ్చింది కాస్త దీన్ని యింకా కూకోపెట్టి తిండెట్టడానికి నేను మీలా వున్నదాన్నా తల్లీ, దీని తరువాతది కుండా మండా కడిగి యింత ఉడకేసి సంటిపిల్లల్ని చూసుకుంటుంది యింటికాడ. దీన్ని నాతో పుల్లలు ఏరుకు రావడానికి తీసికెడతాను. ఇదో రూపాయిడబ్బులు తెస్తే, నానో రెండురూపాయలు తెచ్చి అవి ఇవి కలిపి అందరం యిన్ని గంజినీళ్ళు త్రాగుతున్నాం .... యీ గుంట సచ్చింది తిని కూకుంటానంటే నే నేడినించి తెచ్చి దీనికి ఎడతాను! ముండ పుల్లలేరే అంటే ఏ చెట్టు చాటునో కూకుని ఆటలాడుకొని, పూలు ఏరుకుంటూ నాలుగు పుల్లలు కొట్టేది. ఓ మోపట్టు కెళ్ళి అమ్ముకుంటే రూపాయి డబ్బులు వస్తాయి కొట్టే అంటే నాలుగు పుల్లలు కొడితే నాను ఏటి సేస్తాను చెప్పండమ్మగారూ, నే నేడనించి తెచ్చి యీ గుంట వెధవల్ని మేపను! దొంగ నంజకి ఇదే మందని రూపాయట్టుకురాని నాడు కూడెట్టను పో అని గంజినీళ్ళు పొసేసరికి నంజ నొంగి వచ్చింది. ఇప్పుడు రోజూ మోపటుకెళ్ళి అమ్ముకొస్తుంది. రూపాయి డబ్బులు తెస్తది...."

"మరి—రోజూ మోపు మోసుకెళ్లేది కదా యివాళ ఎందుకు ఎత్తుకోలేక పోతూంది" ఓకావిడ అడిగింది.

"గుంటకి ఆశ లావు అయింది-రూపాయి నాకిచ్చి మరో రూపాయెట్టి చిరుతిళ్ళు కొనుక్కుతిండానికి యింత లావుమోపు కట్టింది. ఎత్తుకోనేపే నంజాఅంటే యినుకుంది కాదు. ఎండ మాడిపోతంది. కాల్లు బొబ్బ

లెక్కాయి. యీడదాకా పడుతూ లేస్తూ మోసుకొచ్చింది. కల్లు తిరుగు తూండాయి. కాళ్లు తేలిపోతండాయి అని యీడ కూలబడింది. మోపు ఎత్తుకోలేక పోతుంది. నాకీయే అమ్ముకొస్తా అంటే ఒగ్గదు, దాని రూపాయి డబ్బులు నే తినేస్తానని భయం దానికి...."

అంతా పూర్తిగా అర్థం అయింది. ఆ తల్లినీ తప్పు పట్టేందుకు కినపడలేదు. రూపాయి పెట్టి చిరుతిండి తినాలనే ఆపిల్ల ఆశ అత్యాశ కాదు!... డబ్బు లేకుండా కూర్చుండబెట్టి పోషించలేని తల్లి అశక్తత అన్యాయం అనలేం.

అంతా కలిసి ఆ కూతురికి తల్లికి రాజీకుదిర్చి మోపులో సగం తల్లి మోసేట్లు, రోజూ ఇచ్చే రూపాయి కాక మిగతాది కూతురికే తల్లి వదిలే సేట్లు బోధ పరిచాం అందరం కలసి. కూతురి మోపులో సగం కట్టెలు తన మోపులో కట్టుకుంది తల్లి. మిగతా సగం మోపు ఎత్తుకుని పిల్ల బయలు దేరింది.

"వెధవలు అలగా వెదవలు తల్లి కూతురు చూడు రూపాయ డబ్బుల కోసం ఎలా కొట్టుకు చస్తున్నారో" అంది ఎదురింటావిడ. (ఆవిడ మొగు డికి వెయ్యి రూపాయలు జీతం)

నిజమే, రెక్కలొచ్చిన పక్షులని పొడిచి పొడిచి గూట్లోంచి తరిమే పక్షులకి, పిల్ల పెద్దయ్యాక దగ్గరకొస్తే కొమ్ములతో పొడిచే పశువులకీ వీళ్ళకి తేడా ఏముంది అన్పించింది. అందరం లోపలికి వెళ్ల బోయాం—

అంతలో కాన్వెంట్ బస్సు వచ్చి ఆగింది. పిల్లలంతా బిలబిల లాడుతూ దిగారు. మా రవి దిగి వచ్చాడు.... 'అయ్యయ్యో.... ఏమిటిరా ఆ మొహం, అలా మాడిపోయిందేమిట్రా, ఈ చెమటలు ఏమిట్రా, ఏం స్కూళ్లో సగం ఎండాకాలం అయ్యేదాకా శలవలు యీయరు. ఈ పిల్లలు యీ మండుటెండలో మసిబొగ్గుల్లా తయారవుతున్నారు' అని విసుక్కుంటూ గబగబ వాడ్ని యింట్లోకి తీసికెళ్ళాను. ఫాను వేసి కూర్చోపెట్టాను. ఫ్రిజ్ లోంచి చల్లనినీళ్లు తీసిచ్చాను. వాడి యూనిఫాం, బూట్లు విప్పి చన్నీళ్ళతో

ముహం పళ్ళు కడిగి బట్టలు మార్చి, కడుపునిండా పెరుగు, అరటిపళ్లు అవి వేసి అన్నం పెట్టాను. వాడన్నం తింటున్నంతసేపూ—వాడి వయసే వున్న ఆ పిల్ల తన తిండికోసం ఎంత కష్టపడుతూందో, ఎన్ని దెబ్బలు తిందో కళ్ల ముందు కదిలి, ఆ పిల్లమీద జాలి, ఎంత సమర్థించినా, ఆ తల్లి పట్ల విముఖత కల్గాయి. మాతృత్వంలో మమతనికూడా మరిచిపోయిన ఆ తల్లిని క్షమించలేకపోయాను— తల్లి బిడ్డకోసం తన ప్రాణాలన్నా అర్పించుతుంది అంటారే!—ఆమాట అబద్ధమా?!

మరో పదిహేనురోజులకి — మధ్యాహ్నం పన్నెండున్నర అయింది, రవి యింకా యింటికి రాలేదని, బస్సు వస్తుందేమో అని చూస్తూ గుమ్మం ముందు నిలుచున్నాను. మార్నింగ్‌స్కూల్. ఏడుగంటలనించి పన్నెండువరకూ స్కూలు— రోజూ యీ పాటికి వచ్చే రవి యింకా రాలేదని ఆరాటంగా బస్సుకోసం ఎదురుచూస్తూ వీధి వరండాలో తచ్చాడుతున్నాను.

రోడ్డుమీద కఱ్ఱల మోపులు ఎత్తుకుని కొందరు వెడుతున్నారు. మా యింటిముందుకి వచ్చేసరికి వాళ్లు ఎండకి కాస్త అలుపు తీర్చుకోడానికి యింటిముందున్న పెద్ద చెట్లకింద మోపులు దింపుకుని ఆయాసం తీర్చుకుంటున్నారు. ఇద్దరు ముగ్గురు ఆడవాళ్లు సందేహిస్తూనే గేటుతీసుకొని లోపలికి వచ్చి నన్ను చూసి, 'కాసిని నీళ్ళు పొయ్యి తల్లీ నోరెండిపోతుంది.... ఎక్కడా నీటిసుక్క రాలడంలేదు పైపుల్లోంచి' అన్నారు. 'నీళ్లేగా ఏం భాగ్యం' అంటూ లోపలికి వెళ్లి చెంబుతో తెచ్చియిచ్చాను. ఆ నీళ్లు తాగిన వాళ్లల్లో ఆనాటి ఆ తల్లి వుంది. దాన్ని గుర్తుపట్టి 'నీ కూతురేది, యివాళ రాలేదే?' అనడిగాను. అది ఒక్కసారిగా గొల్లుమని ఏడుపు లంకించుకుంది. 'ఇంకెక్కడి కూతురో.... నా కూతురో.... నానే సంపేసుకున్నానో తల్లీ.... నా నోట్లో దుమ్ముకొట్టి ఎల్లిపోయిందో నా కూతురు.' ఆ తల్లి గోడుగోడున చేత్తో బుర్ర కొట్టుకుంటూ ఏడవడం ఆరంభించింది. తెల్లబోయాను. అం చచ్చిపోయిందా! ఎలా చచ్చిపోయింది. ఏం జరిగింది? నా సందేహాలు

ప్రశ్నలయ్యాయి. ఆ తల్లి ఏడుస్తూంటే ఆ మిగతావాళ్ళు అసలు సంగతి చెప్పారు. ఆనాడు యింటికి వెళ్ళేసరికి కూతురు ఒళ్ళెరగకుండా పడిపోయింది. ఎండ దెబ్బకో తల్లి కొట్టిన దెబ్బలకో, తిండిలేకో ఏమయితేనేం వళ్ళు తెలియని జ్వరముతో మూసిన కన్ను మరి తెరవలేదట ! ఆ మర్నాడంతా వళ్ళు తెలియని స్థితిలోనే వుందట. ఆసుపత్రికి మోసుకొచ్చారట. బలహీనంమీద వడదెబ్బ కొట్టిందన్నారట డాక్టర్లు. తెలివిలోకి రాకుండానే చచ్చిపోయింది మూడో రోజున.

"రూపాయి డబ్బులు తెచ్చేది తల్లీ రోజూ, నా నోటికాడ కూడు నానే పడదోసుకున్నాను. రూపా యెట్టి సిరుతిండి కొనుక్కోనే లేదు. ఎల్లిపోయిందిరోయి నా కూతురు, నా కూతురో ..." ఏడుస్తున్న ఆ తల్లిని మిగతావాళ్ళు మందలిస్తూ, ఓదారుస్తూ తీసికెళ్ళిపోయారు బయటకి.

కూతురు చచ్చిపోయినందుకంటె ఆ కూతురుతెచ్చే రూపాయి పోయినందుకు ఎక్కువ ఏడుస్తున్నట్లుగా వుంది దాని ఏడుపు ! ఇదేం తల్లి ? చచ్చిపోయిన ఆ పిల్లమీద జాలి కలిగిందికాని, రోజూ చస్తూ బ్రతికే యీ తల్లిమీద నా కప్పుడు జాలి అనిపించలేదు !!

* * *

పంటిగంట అవుతున్నా బస్సుజాడ లేదు. బస్సు ఎందుకు రాలేదో అన్న ఆదుర్దా ఒక పక్క, పిల్లాడు యెండలో ఆకలితో ఏమయ్యాడో అన్న ఆందోళనతో ఆరాటంగా యింట్లోకి బయటికి పదిసార్లు తిరుగుతూ ఆరాట పడ్డాను. ఏం చెయ్యను! టైము గడిచిపోతూంది. బస్సు పాడయ్యిందా ? కొంపదీసి ఎక్కడన్న ఏక్సిడెంటవలేదుగదా? ఎవరినన్నా పంపుదాం అన్నా యింట్లో ఎవరూ లేరు ! ఆయనకూడా టూర్‌లో వున్నారు. లేకపోతే కారు తీసికెళ్ళేవారు. ఏం చెయ్యడమో తెలియక కంగారు పడ్డాను. ఆందోళనకి తోడు ఆకలి కరకరలాడిస్తూంది. ఉదయం ఎనిమిది గంటలకి తిన్న టిఫిను. రోజూ యింటికి వచ్చాక పన్నెండున్నరకి వాడు నేను కలిసి తినడం

అలవాటు. పంటిగంటన్నర అవుతున్నా బస్సు జాడ లేదు. ఇంట్లోకి బయటికి తిరిగి తిరిగి కాళ్ళలో నీరసం వచ్చి కుర్చీలో కూలబడ్డాను. ఆకలి ఒక ప్రక్క— పోనీ భోంచేద్దాం అంటే, అయ్యో పిల్లాడు యింకా తినలేదే అన్పించింది. వాడు ఆకలితో ఎండలో ఎక్కడ మాడుతున్నాడో అన్నం తినేయనా నేను అన్పించింది. ఏం చెయ్యాలో తోచక నిస్సహాయంగా మరో సారి వీధిలోకి వెళ్లాను. బస్సుజాడ లేదు. ఎన్ని గ్లాసుల నీళ్ళతో ఆకలిని చంపగలను. రెండు గంటలవుతూంది. వాడంటే ఉదయం పాలు తాగాడు, ఎగ్ తిన్నాడు. టిఫిను తిన్నాడు. మధ్యలో ఇంటర్వెల్లో తినడానికి శాండ్ విచెస్ యిచ్చాను. నేను ఉదయం ఎనిమిది గంటలకు తిన్న ఇడ్లెను తప్ప ఏం తిన్నాను ? స్కూల్లో ఏదన్నా ప్రోగ్రాం వుందేమో ! ఏవేవో ఆలోచనలతో రెండు గంటలు కొట్టడం విని యింక ఆకలికి ఆగలేక నన్ను నేను సమర్థించుకుంటూ కంచంముందు కూర్చున్నాను. వాడు రాలేదనే ఆరాటంలోనే ఏదో యింత తిన్నాననిపించుకుని లేచానో లేదో బస్సువచ్చి ఆగింది. 'బస్సు త్రోవలో పాడయిందమ్మా' అంటూ వాడువచ్చాడు. వాడి మొహం చూస్తూంటే— అప్పటికి ఆకలి చల్లారిన నాకు— పసిపిల్లాడు తినకుండా నేను తినడం ఏదో తప్పుపని చేసి నట్లనిపించింది. 'అమ్మా, నీ అన్నం తినేశావా అప్పుడే' అని రవి అడిగేసరికి గిల్టీగా ఫీలయ్యాను. ఆ క్షణంలో అప్రయత్నంగా ఆ కర్రలమ్మి మొహం కన్పించింది. ఎండలో మైళ్ళకి మైళ్ళు నడిచి కట్టెలమ్ముకుని పిల్లలకి గంజినీళ్ళు పోసే ఆ అమ్మ కంటె నే నెందులో ఎక్కువ అన్పించింది. ఇంటిపట్టున నీడలో సుఖంగా కూర్చున్న నేను ఆకలికి ఒంటిగంటకంటే ఎక్కువ ఆగలేక పిల్లాడికి పెట్టకుండానే నా కడుపు నింపుకున్న నేను మాతృత్వం గురించి, మమతలు అనుబంధాలు గురించి మాట్లాడటం కన్నా హాస్యాస్పదం ఏముంటుంది?

అన్నీ సవ్యంగా వున్నంతసేపే ఆప్యాయతలు, అనుబంధాలు అన్న నిజం గుర్తించలేని నాకు ఆ తల్లి ముందు నిలబడే అర్హత వుందా అన్పించింది !

(జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక '73)